క్లుప్తంగా

ఏటిగట్ల రక్షణకు సర్వం సిద్ధం

పి.గన్నవరం: గోదావరి వరదల సీజన్ నేపథ్యంలో ఏటిగట్ల రక్షణకు అవసరమైన సామగ్రిని స్థానిక ఫ్లడ్ స్టోర్‌లో సిద్ధంగా ఉంచినట్టు పి.గన్నవరం హెడ్వ ర్క్స ఏఈఈ ఆచంట దుర్గానాయుడు తెలిపారు. మండలంలోని ఏటిగట్లు పటిష్టంగా ఉన్నాయని చెప్పారు. మూడో ప్రమాద హెచ్చరిక దాటితే మాత్రం ఎల్.గన్నవరం వద్ద వశిష్ట ఎడమ గట్టుకు ఇబ్బంది ఉంటుందన్నారు. అక్కడ పటిష్ట చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. స్థానిక ఫ్లడ్ స్టోర్ వద్ద 6 వేల బ్యాగ్‌లు, 1,800 పెద్ద సర్వేకర్రలు, 770 క్యూబిక్ మీటర్ల ఇసుక, తాళ్లను సిద్ధం చేసినట్టు వివరించారు. వైనతేయ ఎడమ గట్టు పరిధిలో అవుట్‌ఫాల్ స్లూయిజ్ షట్టర్ల నుంచి నదిలోని వరద డ్రెయిన్లలోకి రివర్స్‌లో వెళ్లకుండా మరమ్మతులు నిర్వహించి, పటిష్టం చేసినట్టు తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యుడికి విరాళం ఇస్తున్న సాంబమూర్తి

సఖినేటిపల్లి: మోరి శివాలయం పునర్నిర్మాణానికి కాకినాడకు చెందిన ముప్పర్తి ఫణికృష్ణ, ధనలక్ష్మి దంపతులు గురువారం రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ మేరకు మోరిపోడులో వారి కుటుంబ సభ్యుడు ముప్పర్తి సాంబమూర్తి ఆలయ కమిటీ సభ్యుడికి నగదును అందజేశారు.

నిత్యావసరాల వితరణ

సఖినేటిపల్లి: మండలంలోని పల్లిపాలేనికి చెందిన మృతుడు కామాని దుర్గాప్రసాద్ కుటుంబానికి జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆరు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను గురువారం అందజేశారు. ఈ నెల ఆరున మృతుడి తల్లి ఆదిలక్ష్మిని ఆయన ఇంటి వద్ద పరామర్శించి, ఆర్థిక సాయం చేశారు. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా కుటుంబ పోషణ కష్టతరమవుతోందంటూ ఆమె కన్నీటిపర్యంతమైంది. ఈ నేపథ్యంలో ఆరు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను డీటీఓ సమకూర్చి, స్వయంగా ఆమెకు అందజేశారు.

ఆడ దూడల ప్రదర్శన



అవిడిలో ప్రదర్శనలో ఉంచిన లేగదూడలు

కొత్తపేట: మండలంలోని అవిడి గ్రామంలో గురువారం లేగదూడల ప్రదర్శన, ర్యాలీ, పాడి రైతుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన ఏడాదిలోపు పెయ్య (ఆడ) దూడలను ఎంపిక చేసి, కార్యక్రమం నిర్వహించారు. అవిడి పశు వైద్యాధికారి డాక్టర్ ముద్రగడ వీరరాఘవరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ర్యాలీని ప్రారంభించారు. అనంతరం జరిగిన పాడి రైతుల అవగాహన సదస్సులో డాక్టర్ వీరరాఘవరావు మాట్లాడుతూ, పాడి పశువులు, లేగదూడల సంరక్షణ, కృత్రిమ గర్భధారణ, పాడి పరిశ్రమ ద్వారా ఆర్థికాభివృద్ధి తదితర అంశాలను వివరించారు. అనంతరం దూడలకు విటమిన్ ఇంజెక్షన్లు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, టానిక్‌లు, రైతులకు స్టీల్ కేన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యుడు దూళి సూరిబాబు, ఉప సర్పంచ్ పల్లి సామ్య, దిలీప్, నీటి సంఘం అధ్యక్షుడు రెడ్డి తాతాజీ, ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్

రావులపాలెం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ ఎం శేఖర్‌బాబు గురువారం తెలిపారు. పాత ఎల్ఐసీ భవనం సమీపంలో దాడి చేసి, వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని, 600 కేజీల రేషన్ బియ్యం సీజ్ చేశామన్నారు. కర్రి రామిరెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిట్టూరి

అంబాజీపేట: అయినవిల్లి మండలానికి చెందిన చిట్టూరి శ్రీనివాస్ స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, డైరెక్టర్లుగా కోరపాటి వెంకటేశ్వరరావు (వైస్ చైర్మన్), అడబాల సూర్యవతి, అంబటి గంగాభవాని, కముజు నాగసత్య, కోసూరి పోసమ్మ, మట్టపర్తి సోమేశ్వరరావు, మేడిశెట్టి మంగతాయారు, మోర్తా వీర వెంకట సత్యనారాయణ, నేదునూరి కుమారి, సలాది ప్రసాద్, గంధం వెంకటేశ్వరరావు, వక్కపట్ల ఆదిలక్ష్మి, దుర్గా శ్రీనివాసరావు, కుడుపూడి సత్యవేణిని నియమించారు.

క్షయ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

రాజోలు: క్షయ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని అడిషనల్ డీఎంహెచ్ఓ భారతలక్ష్మి అన్నారు. గురువారం చింతలపల్లి గ్రామంలో రాజోలు కో-లొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ నిర్వహించారు. సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

పడవే దిక్కు..!

- లంక గ్రామాల ప్రజలకు వరద కష్టాలు ప్రారంభం
- మూడు, నాలుగు నెలల పాటు ఇవే ఆధారం
- వంతెన పూర్తయితే ఇబ్బందులు తీరుతాయంటున్న ప్రజలు



స్కూళ్లకు వెళ్లేందుకు బూరుగులంక రేవులో పడవ ఎక్కుతున్న విద్యార్థులు

పి.గన్నవరం: గోదావరి నదీ పాయల్లో వరద ఉధృతి పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలకు కష్టాలు ప్రారంభమయ్యాయి. పి.గన్నవరం మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెల వారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజల పరిస్థితి వర్ణణాతీతం. వరదలు ప్రారంభమైన తర్వాత మూడు, నాలుగు నెలల పాటు వారు పడవలపైనే ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ఆయా లంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఏటా వరదల సీజన్‌లో తీవ్ర ఇబ్బందుల నడుమ పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

ఈ నాలుగు లంక గ్రామాల ప్రజలు తమ రాకపోకల కోసం ఏటా వశిష్ట నదీపాయలో తాత్కాలిక రహదారి నిర్మించుకుంటారు. ఈ నేపథ్యంలో గత ఏడాది నిర్మించుకున్న తాత్కాలిక రహదారి గురువారం వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఆయా గ్రామాల్లో సుమారు మూడు వేల మంది నివసిస్తున్నారు. దీంతో ప్రస్తుతం రేవులో రెండు ఇంజిన్ల పడవలను ఏర్పాటు చేశారు. వాటిపైనే ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఏటా వరదల సీజన్‌లో మూడు, నాలుగు నెలల పాటు తమకు ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వరదలు మరీ ఎక్కువైతే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రమాదకర పరిస్థితుల్లో పడవలపై వెళ్తున్నారు. వారు తిరిగి ఇళ్లకు చేరే వరకూ తల్లిదండ్రులు ఆందోళనతో ఉంటున్నారు. రాత్రి వేళల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారిని బయటి ప్రాంతాల్లోని ఆస్పత్రులకు తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఏడాది మంచినీటి బస్తాలు తరలిస్తున్న పడవ నీట మునగడంతో పంచాయతీ వర్కర్ మృతి చెందాడు.

రూ.49.5 కోట్లతో వంతెన నిర్మాణం ప్రారంభం

మూడేళ్ల క్రితం వరద బాధితులను పరామర్శించేందుకు ఇక్కడికి వచ్చిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లంక గ్రామాల ప్రజలు తమ కష్టాలను విన్నవించారు. దశాబ్దాల తరబడి కోరుతున్నా ఎవ్వరూ వంతెన నిర్మించడం లేదని వారు వివరించారు. దీంతో రూ.49.5 కోట్ల వ్యయంతో వశిష్ట నదిపై వంతెన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కాంట్రాక్టు సంస్థ శరవేగంగా ఇప్పటికి 60 శాతం పనులు పూర్తి చేసింది. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే నాలుగు గ్రామాల ప్రజలకు వరద కష్టాలు తీరతాయి. కాంట్రాక్టు సంస్థకు పెండింగ్ బిల్లులు సకాలంలో విడుదల చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



బూరుగులంక రేవులో పడవ ప్రయాణం

స్కూళ్లకు పంపేందుకు భయపడుతున్నాం



ఏటా వరదల సీజన్‌లో ప్రమాదకర పరిస్థితుల నడుమ పడవలపై విద్యార్థులను పాఠశాలలు, కళాశాలలకు పంపుతున్నాం. వారు ఇళ్లకు తిరిగి వచ్చే వరకూ ఆందోళనతో ఉంటున్నాం. దీంతో కొంతమంది వరదల సీజన్‌లో జి.పెదపూడిలో అద్దె ఇళ్లకు వెళ్తున్నారు. మా కష్టాలను గుర్తించిన మాజీ సీఎం వైఎస్ జగన్ వంతెన పనులు ప్రారంభించారు. అది పూర్తయితే మా కష్టాలు తీరతాయి.

– నేతల శ్రీను, ఊడిమూడిలంక

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



నదీపాయలో నిర్మించుకున్న తాత్కాలిక రహదారి కొట్టుకుపోయిన తర్వాత మూడు, నాలుగు నెలల పాటు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే పడవలపై వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నాం. వ్యవసాయ ఉత్పత్తులను బయటకు తరలించేందుకు వ్యయ, ప్రయాసలకు గురవుతున్నాం. త్వరితగతిన వంతెనను పూర్తి చేయాలి

– అదబాల రాంబాబు, రైతు, బూరుగులంక

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆర్డీఓ శ్రీకర్



బూరుగులంకకు పడవపై వెళుతున్న ఆర్డీఓ శ్రీకర్

పి.గన్నవరం: వరదల సమయాల్లో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట ఆర్డీఓ శ్రీకర్ సూచించారు. బూరుగులంక రేవు వద్ద వశిష్ట నదీ పాయలో తాత్కాలిక రహదారి వరద ఉధృతికి కొట్టుకుపోయిన నేపథ్యంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి టి.సాయినాథ్ జయచంద్రతో కలిసి, ఆర్డీఓ శ్రీకర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం బోటుపై లంకలోకి వెళ్లి ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలతో ఆర్డీఓ మాట్లాడారు. పడవలపై వెళ్లే సమయాల్లో లైఫ్ జాకెట్లు ధరించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, వైద్యం, విద్యుత్ సేవలు నిరంతరాయంగా అందించేందుకు ఆయా శాఖల అధికారులను సిద్ధం చేసినట్టు చెప్పారు. అధికార యంత్రాంగం ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఏ ఇబ్బంది వచ్చినా వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. రేవుకు ఇరువైపులా పోలీసు, అగ్నిమాపక సిబ్బంది గస్తీ నిర్వహించాలని ఆర్డీఓ ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరావు, వీఆర్వో కె.భగవన్నారాయణ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలు

- షిర్డీ సాయి మందిరాల్లో ప్రత్యేక పూజలు
- ఆధ్యాత్మిక కార్యక్రమాలు, గురువులకు సత్కారం

కొత్తపేట: గురుపౌర్ణమి పర్వదినాన్ని గురువారం గ్రామగ్రామాన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షిర్డీ సాయిబాబా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. వాడపాలెం గ్రామంలో వరసిద్ధి వినాయక స్వామి, షిర్డీ సాయిబాబా మందిరంలో ఆలయ కమిటీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆయా స్వామివార్లకు అర్చకుడు పీఎస్ఎన్ సత్తిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేషాలంకరణల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. రిటైర్డ్ ఎంఈఓ, ప్రభుత్వ పెన్షనర్ల సంఘ ప్రధాన కార్యదర్శి ఏడిద సత్తిరాజును ఘనంగా సత్కరించారు. కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మట్టా పట్టాభిరామయ్య, పెదపూడి బాపిరాజు, మట్టా బాబ్జి, బండారు శ్రీనివాస్, పళ్లంరాజు, భాస్కరరావు, వరగన బ్రహ్మయ్య, రాంబాబు, బండారు వెంకయ్య, కడియం కామేశ్వరరావు పాల్గొన్నారు. కొత్తపేట బెడిపాలెం సమీపంలోని షిర్డీ సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక హరిహర దేవాలయం ప్రాంగణంలో షిర్డీ సాయిబాబా మందిరంలో ఆలయ నిర్మాణకర్త డాక్టర్ కాశిన గేయానంద శేషుబాబు దంపతుల ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. పలివెల కోదండ రామస్వామివారి ఆలయ మండపంలో సద్గురు సాయినాథ్ స్వామివారికి సీఎస్ఎస్ ట్రస్ట్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు.

ప్రత్యేక పూజలు

అంబాజీపేట: గురు పౌర్ణమి వేడుకలను అంబాజీపేట, వాకలగరువుల్లో ఘనంగా నిర్వహించారు.



అంబాజీపేటలో సాయిబాబాకు అభిషేకం చేస్తున్న భక్తులు

కొర్లపాటివారిపాలెంలోని గురుదత్త సద్గురు షిర్డీ సాయిబాబా మందిరంలోను, వాకలగరువులో సంతాన సిద్ధివినాయక దత్తాత్రేయ షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. అన్న సమారాధనలు జరిగాయి. చిరతపూడి, గంగలకుర్రు అగ్రహారం, ఇరుసుమండ, పుల్లేటికుర్రు తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రత్యేక అభిషేకాలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలమూరులోని షిర్డీసాయి మందిరంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు, కార్యదర్శి వంటిపల్లి పాపారావు నేతృత్వంలో స్వామివారికి పండ్ల రసాలు, వివిధ రకాల పూలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నర్సిపూడిలో షిర్డీసాయి మందిరంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు గట్టి రామారావు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం జరిగింది. ఆలయ ఆవరణలో ఏకాహం నిర్వహించారు. చొప్పెల్ల, నర్సిపూడి, పెనికేరు, జొన్నాడ గ్రామాల్లోని షిర్డీ సాయి మందిరాల్లో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ అన్న సమారాధనలు జరిగాయి.

మొక్కుబడుల చెల్లింపులు

మామిడికుదురు: గురు పౌర్ణమి వేడుకలు వివిధ గ్రామాల్లో ఘనంగా జరిగాయి. మామిడికుదురు, మొగలికుదురు, మగటపల్లి, పెదపట్నం, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడిబాడవ, లూటుకుర్రు తదితర గ్రామాల్లోని మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విభూది, పాలతో సాయిబాబాకు ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు భారీ సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని, ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆయా ఆలయాల వద్ద భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చిర్ల జగ్గిరెడ్డి

గురు పౌర్ణమి పూజల్లో జగ్గిరెడ్డి

రావులపాలెం: గురు పౌర్ణమి సందర్భంగా గోపాలపురం గ్రామంలో గురువారం జరిగిన ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని తేతలి వారి వీధిలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో, పట్టాభిరామ రెడ్ల రామాలయం వీధిలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో స్వామివారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. రావులపాలెం పార్కు వద్ద ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

తక్షణమే నిధులు విడుదల చేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు

పి.గన్నవరం: ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల కోసం వశిష్ట నదీపాయపై నిర్మిస్తున్న వంతెనకు తక్షణమే నిధులు విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బూరుగులంక రేవు వద్ద నదీ పాయలో కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారిని గురువారం ఆయన జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు, మండల అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్‌తో కలిసి పరిశీలించారు. పడవలపై ప్రయాణిస్తున్న లంక గ్రామాల ప్రజలతో మాట్లాడారు. గతంలో ఆయా గ్రామాల్లో పర్యటించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంతెన నిర్మాణానికి రూ.49.5 కోట్లు మంజూరు చేసి, పనులు ప్రారంభించినట్టు గుర్తు చేశారు. కాంట్రాక్టు సంస్థకు ఇంతవరకూ బిల్లులు విడుదల చేయలేదన్నారు. నిధులు విడుదల చేస్తే మిగిలిన పనులు వేగవంతం అవుతాయన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. సర్పంచ్ దంగేటి అన్నవరం, పార్టీ నాయకులు దొమ్మేటి వెంకట శివరామన్, సాధనాల రమేష్, వాసంశెట్టి తాతాజీ, మింగడు దిటి చిన్ని, రాణి శ్రీధర్, కడలి వెర్రియ్య, కోట ఏడుకొండలు, నక్కా సునీల్ తదితరులు పాల్గొన్నారు.



బూరుగులంక రేవులో ప్రజలతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

శాకంబరి దేవి.. శరణు శరణు



ఆలమూరులో రావులమ్మ



అంబాజీపేటలో కనకదుర్గమ్మ



విజయ కనకదుర్గాదేవి

కొత్తపేట: ఆషాఢ మాసం, పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక బొరుసువారి సావరంలో ఉన్న విజయ కనకదుర్గాదేవి అమ్మవారు గురువారం శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. ఆలయ పునర్నిర్మాణకర్త, ఆలయ పోషకులు బొరుసు వెంకటఉదయభాస్కర్, వసుధ దంపతుల పర్యవేక్షణలో ప్రధానార్చకుడు బిక్కవోలు సత్యనారాయణ, వేద పండితుడు బిక్కవోలు అనంత లక్ష్మణకుమారాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. బి.సావరం, శీలంవారిపాలెం, కొత్తపేట, పరిసర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన మహిళలతో పండితులు కుంకుమ పూజలు జరిపించారు.

విజయదుర్గ అమ్మవారు

అంబాజీపేట: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక పశువుల మార్కెట్ వద్ద వేంచేసిన విజయ కనకదుర్గ అమ్మవారు శాకంబరిగా గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులు, భక్తులు సమకూర్చిన వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు.

రావులమ్మ తల్లి

ఆలమూరు: ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆలమూరులో గ్రామదేవత రావులమ్మ వారు శాకంబరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని 558 కేజీల 58 రకాల కూరగాయలు, ఆకుకూరలతో భక్తులు అలంకరించారు. అమ్మవారికి పలువురు భక్తులు సారెను సమర్పించారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కూటమి వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొమ్ముల రాము

మామిడికుదురు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ఏ విధంగా మోసం చేసిందో ప్రజలకు వివరించాల్సిన సమయం ఆసన్నమైందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొమ్ముల రాము అన్నారు. పాశర్లపూడిలో గురువారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ నెల 12వ తేదీన జరిగే బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని సమావేశం పిలుపునిచ్చింది. పార్టీ శ్రేణులంతా విధిగా సమావేశానికి హాజరుకావాలని నేతలు కోరారు. సమావేశంలో పార్టీ నేతలు తోరం భాస్కర్, చిట్టూరి రామకృష్ణ, తోరం గౌతమ్, చిక్కం బుజ్జిబాబు, గెడ్డం వెంకటేశ్వరరావు, జక్కంపూడి వాసు, అన్వర్ తాహిర్ హుస్సేన్, కొమ్ముల సూరిబాబు, గెడ్డం ఏసుదాసు, పాలమూరి గోపాల్, కొమ్ముల శ్రీనివాస్, కుసుమ శ్రీను, కొప్పిశెట్టి హేమసుందర్, బత్తుల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాము

రేపు ఉచిత పరిచయ వేదిక

మామిడికుదురు: తెలుగు రాష్ట్రాల నాయీ బ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదికను శనివారం కాకినాడ సూర్య కళామందిర్ కల్పనా సెంటర్‌లో ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు కె.వెంకట్రియ్య గురువారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. నాయీ బ్రాహ్మణ కుటుంబాల వారు వివాహం కోసం తమ పిల్లలను ఈ పరిచయ వేదికకు తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సామాజికాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం

జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

మామిడికుదురు: సమాజంలో ఏ రంగం అభివృద్ధి సాధించాలన్నా ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. మామిడికుదురు జూనియర్ కళాశాల, మామిడికుదురు జెడ్పీహెచ్‌లో మెగా పీటీఎం కార్యక్రమాల నిర్వహణ తీరును గురువారం ఆయన పరిశీలించారు. కెమిస్ట్రీ ల్యాబ్, వసతులు, మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్లను పరిశీలించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు సమష్టి భాగస్వామ్యం కావాలన్నదే కార్యక్రమ ప్రధానోద్దేశమన్నారు. కార్యక్రమంలో డీఈఓ షేక్ సలీమ్ బాషా, ఎంఈఓలు పాల్గొన్నారు.

అన్నింటికీ చదువే కీలకం

అంబాజీపేట: ప్రతి ఒక్కరి భవిష్యత్తు బంగారు బాట అయ్యేందుకు చదువే కీలకమని, తల్లితండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అమ్మ పేరుతో మొక్క కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తొండవరం, పుల్లేటికుర్రు, గంగలకుర్రు అగ్రహారం, ఇసుకపూడిలలో ఉన్న జెడ్పీ హైస్కూళ్లు, పుల్లేటికుర్రు ఏవీఎస్ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు జరిగాయి. స్కూళ్లలో బోధనాంశాలు, మౌలిక వసతులు తదతర అంశాలపై చర్చించారు. గూడపల్లి కొప్పిడి వారి మెరక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, ఎంఏఓ సీహెచ్ రమ్య ప్రియాంక, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుందర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురులో మెగా పీటీఎంను పరిశీలిస్తున్న కలెక్టర్

సైకిళ్ల పంపిణీ

సఖినేటిపల్లి: కొత్తగా చేరిన విద్యార్థులకు సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 25 సైకిళ్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఓగిరాల నవీన్ పాఠశాల అభివృద్ధికి రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఏపీ ఎస్సీసీ స్టేట్ మానటరింగ్ ఆఫీసర్ గుండేపల్లి ప్రభావతి పిల్లలకు మొక్కలను పంపిణీ చేశారు. ఎంపీటీసీ రుద్రరాజు వెంకట్రాజు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.రెండు లక్షలతో నిర్మించిన సైకిల్ షెడ్‌ను ప్రారంభించారు.

రాజోలు: విద్యార్థులు చదువుపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఎమ్మెల్యే దేవ వరప్రసాదరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జోగి శాంతకుమారి అధ్యక్షతన జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

కొత్తపేట: ప్రాథమిక దశలోనే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. పలివెల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎంలో ఆయన పాల్గొన్నారు. హెచ్ఎం పి.ఇందిరాబాయి అధ్యక్షత వహించారు. పది పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రిటైర్డ్ హెచ్ఎం భమిడిపాటి నరేస్ రూ.10 వేలు అందజేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ట్రస్ట్, వాసవీ క్లబ్ తరఫున జి.లక్ష్మి 400 పుస్తకాలు సమకూర్చారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల, అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ స్కూల్‌లో మెగా పీటీఎం నిర్వహించారు. సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యుడు దూళి సూరిబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి తాతాజీ, వైఎస్సార్ సీపీ నాయకుడు పల్లి దిలీప్ తదితరులు పాల్గొన్నారు. బిల్లకుర్రు శివారు కొత్తపాలెం జెడ్పీ, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మెగా పీటీఎంలు జరిగాయి.

ఆలమూరు: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పీటీఎం కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ ఎ.రాజు, ఎంఈఓలు బి.అప్పాజీ, ఎస్వీ సుబ్బరాజు పర్యవేక్షించారు. వివిధ అంశాలపై ఉపాధ్యాయులు అవగాహన, కల్పించారు.

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పీటీఎంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 900 మందితో పీటీఎం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి బీవీ రమణ పాల్గొన్నారు.